క్లుప్తంగా

జాతీయ ఉపకార వేతనానికి పాకల విద్యార్థుల ఎంపిక



కె. గాయత్రీ ప్రియ



కె. ప్రణవ్ శ్రీ గౌతమ్

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో జరిగిన ఉపకార వేతనం అర్హత పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు కె. గాయత్రీప్రియ, కె. ప్రణవ్ శ్రీ గౌతమ్ ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంపికైన వారిని అభినందించారు.

నీట్ ఫలితాల్లో కిరణ్మయికి 656 మార్కులు



కిరణ్మయికి స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామానికి చెందిన ఆలూరు కిరణ్మయి ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో 656 మార్కులతో జాతీయ స్థాయిలో ఓబీసీ కోటాలో 10,718 ర్యాంకు సాధించింది. కిరణ్మయి ఇంటర్మీడియెట్ బైపీసీలో 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. కిరణ్మయి తండ్రి గిరి బాబు విద్యా శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, తల్లి శాంతి గృహిణి, ఎంబీబీఎస్ పూర్తి చేసి న్యూరాలజీలో పీజీ చేయడమే తన లక్ష్యమని కిరణ్మయి తెలిపింది. నీట్‌లో మంచి మార్కులు సాధించిన సందర్భంగా కిరణ్మయికి ఆమె తల్లి శాంతి స్వీట్లు తినిపించి తన ఆనందాన్ని చాటుకుంది.

10న మండల సర్వసభ్య సమావేశం

సింగరాయకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కనిగిరి డివిజన్‌లో 225 మి.మీ వర్షపాతం నమోదు

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల్లో 225 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరిన 17.1 వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి, వాగుల్లో, కుంటల్లో నీరు చేరాయి. శివారు ప్రాంతాల్లోని మట్టి రోడ్లు చిత్తడిమయంగా మారాయి. కనిగిరి మండలంలో 2.4 మి.మీ, వెలిగండ్లలో 25.2 మి.మీల, హెచ్ఎంపాడులో 46.2 మి.మీ, పామూరులో 2.4 మి.మీ, పీసీపల్లిలో 34.0 మి.మీ, సీఎస్‌పురంలో 12.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

నాగిరెడ్డిపల్లి ఆస్పత్రి తనిఖీ

వెలిగండ్ల: మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్ఓ సురేష్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల గదిని, రోగులు ఉండే గదిని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యురాలు హైమావతికి ఆస్పత్రిలో కొంతమంది ఆరోగ్య సిబ్బందికి మధ్య ఉన్న విభేదాలపై ఆరా తీశారు. ఇద్దరి అభియోగాలను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు డీఎంఅండ్‌హెచ్ఓ సురేష్‌కుమార్ తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా విద్యా సామగ్రి



ఎమ్మార్సీకి చేరిన విద్యా సామగ్రి

పీసీపల్లి: మండలంలోని ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు 2024–25 విద్యాసంవత్సరానికి విద్యాసామగ్రి ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓలు సంజీవ్ రావు, శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం వచ్చాయని పాఠశాలల హెచ్ఎంలు తగిన పత్రాలతో వచ్చి తీసుకోవాలని కోరారు.

శిక్షణ శిబిరాలతో నైపుణ్యాలు మెరుగు



కందుకూరులో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు



గుడ్లూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

కందుకూరు: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడ్డాయని గ్రంథపాలకురాలు నాగరజని అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం జరిగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిక్షణ శిబిరంలో వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, పుస్తక పరిచయ సభలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులతో పాటు, పుస్తకాలను బహుకరించామని వివరించారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. పాలపిట్ట పుస్తక రచయిత ముప్పవరపు కిశోర్ మాట్లాడుతూ అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లని కదలిస్తుందని, స్వాతంత్ర పోరాటంలో గ్రంథాలయ ఉద్యమం విద్యార్థులను, యువతను, మేధావులను సమీకరించి సాహిత్య, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించిందని వివరించారు. శిబిరంలో పాలపిట్ట పుస్తకాన్ని పరిచయం చేయడం, విద్యార్థులకు అందించడం ఆనందంగా ఉందన్నారు. గ్రంథాలయంలో సాహిత్య, సాంస్కృతిక, చరిత్రకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని వాటిని చదవడం ద్వారా విద్యార్థులు తమ మేథోసంపత్తిని పెంచుకోవచ్చునని వివరించారు. దమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించి శాస్త్రీయ అధ్యయనానికి గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. అమ్మ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బీవీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీవారి సేవా సమితి అధ్యక్షుడు ఏవీఆర్ మూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిల్లర సుబ్బారావు, పగడాల రోశయ్య, ఎస్‌కే ఖాదర్ బాషా, జి.శ్రీనివాసులు, సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన సంపదకు నిలయాలు అని వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని రిటైర్డు తెలుగు ఉపాధ్యాయులు ఎస్.ప్రసాద్, రమణరాజు, ఎం.ప్రసాద్ అన్నారు. స్థానిక ఎర్రన గ్రంథాలయంలో గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయ శాఖ వారు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారిలో దాగి ఉన్న వివిధ రకాల నైపుణ్యాలను వెలికితీయడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. గ్రంథపాలకుడు ఎల్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉలవపాడులో బహుమతులు అందచేస్తున్న దాత నిశాంత్, గ్రంథపాలకుడు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ 20 రోజుల పాటు జరిగిన శిక్షణలో విద్యార్థులకు నాలెడ్జితో పాటు శారీరక,మానసిక ఆనందం కలిగేలా ఎన్నో కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ 40 మంది విద్యార్థులకు కన్నా ఎక్కువ మందిని పంపించిన తల్లితండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు చింతం కోటారెడ్డి జ్ఞాపకార్థం నిశాంత్ రెడ్డి బహుమతులు అందచేశారు. మొత్తం 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి



పాతసింగరాయకొండలో రథం తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి 26 వరకు 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగేలా కృషి చేద్దామని తహసీల్దార్ భవానీశంకర్ అన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం ఉదయం ఆలయ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్సై టి. శ్రీరాం మాట్లాడుతూ రథోత్సవంలో ఎటువంటి అపశ్రుతి జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రథోత్సవానికి ముందు రోజు రథాన్ని జేసీబీల సహకారంతో షెడ్డు నుంచి బయటకు తీసుకుని రావాలని సూచించారు. రథం తిరిగే దారిలో ఎటువంటి డివైడర్లు ఉంటే తొలగించాలని, గుంటలు ఉంటే పూడ్చించాలని, రోడ్లు మార్జిన్లు పటిష్టం చేయాలని సూచించారు. రథం తిరిగే దారిని అధికారుల బృందం పరిశీలించింది. ఈ నెల 12వ తేదీ మరల సమావేశమై భద్రత ఏర్పాట్లపై రెండో సారి సమీక్ష చేద్దామని తీర్మానించారు. దేవస్థాన ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి. కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీ నరసింహాచార్యులు, ఎంపీడీఓ నాగేష్‌కుమారి, డీటీ తన్నీరు వెంకటేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మట్టా సుబ్బారావు, స్వాములు, విద్యుత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలస్‌కు ఘన నివాళి



సుదర్శి పాలస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు: నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం, బలహీన వర్గాల ప్రజలు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన నేత సుదర్శి పాలస్ అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ నాయకుడు పాలస్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలస్ బలహీన వర్గాల్లో జన్మించి తనవర్గ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమబాట పట్టి శ్రీకాకుళం సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారని వివరించారు. అనంతరం కందుకూరు ప్రాంతంలో పాఠశాలలను స్థాపించి ఎంతో మంది పేద బిడ్డల భవిష్యత్‌కు పునాదులు వేశారని చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమంలో చేరిన పట్టణంలోని నాంచారమ్మ కాలనీలో పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేశారని, ఆయన తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పోరాటాలతో పేదల పక్షాన పోరాడారన్నారు. పాలస్ వంటి కమ్యూనిస్టు ఉద్యమ నేత నేటి కమ్యూనిస్టులకు ఎంతో ఆదర్శప్రాయుడని, ఆయన స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, ఆనందమోహన్, రాము, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, వినయ్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీఎం రాజ్యలక్ష్మి



బహుమతులు అందుకున్న విజేతలతో గ్రంథపాలకుడు కోటేశ్వరరావు

కొండపి (సింగరాయకొండ): కొండపి గ్రంథాలయంలో గత నెల 15 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15వ తేదీ నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించామని అందులో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం, కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం జరిగిందని, అలాగే విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో క్యారమ్స్, తాడు ఆట, రింగ్ లెగ్స్ వంటి ఆటలు పోటీలు నిర్వహించామన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఎంఈఓ

హనుమంతునిపాడు: విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎస్ రమణయ్య అన్నారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన వేడుకలు గురువారంతో ముగిశాయి. ఈ విజ్ఞాన వేడుకలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన బాల బాలికలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, నీతి కథల పుస్తకాలు, వార్త పత్రికలు చక్కగా వినియోగించుకొని మీ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదువుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక పఠనం చేయడం ద్వారా మన జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు అహ్మద్ ఫరీఫ్, కె.నాగేంద్ర , ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

బీమా సద్వినియోగం చేసుకోవాలి



టంగుటూరులో రైతుల మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



వేలం పరిశీలిస్తున్న ప్రాంతీయ బోర్డ్ అధికారి లక్ష్మణరావు

టంగుటూరు: రైతులు నష్ట పరిహార బీమా సద్వినియోగం చేసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యార్నీ క్యూరింగ్ చేసేటప్పుడు పొగాకుకు నష్టం జరిగితే ప్రీమియం రూ. 94 చెల్లిస్తే లక్ష రూపాయలు వరకు బీమా వచ్చేదన్నారు. అయితే ప్రస్తుతం పొగాకు మార్కెట్‌లో కేజీ సగటు ధర సుమారు రూ. 250 ఉందని.. విలువ పెరిగినందున వలన నష్ట పరిహారం బీమా రూ. 1 లక్ష నుంచి రెండు లక్షలు వరకు పెంచుతున్నామన్నారు. దీనిపై రైతులంతా వారి అభిప్రాయాన్ని వెంటనే బోర్డు అధికారులకు తెలపాలన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ. 330

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ. 330కు వ్యాపారులు కొనుగోలు చేశారు. జమ్ములపాలెం తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 900 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 848 కొనుగోలు జరిగగా, 52 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 330 పలకగా, కనిష్ట ధర రూ. 2055 పలకగా, సరాసరి రూ. 278. 63 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వేలానికి అన్ని గ్రేడ్‌లు తెచ్చుకోండి

కొండపి (సింగరాయకొండ): పొగాకు రైతులంతా వేలానికి అన్ని రకాల గ్రేడ్ లు తెచ్చుకోవాలని ఒంగోలు ప్రాంతీయ బోర్డ్ అధికారి లక్ష్మణరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేలం సరళిని, వివిధ పొగాకు గ్రేడులకు వచ్చిన ధరలను పరిశీలించి రైతులతో వారి సమస్యలను అడిగారు. ధరలు మంచిగా ఉన్నందున్న సంతృప్తి వ్యక్తం చేశారు. అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. అలాగే కంపెనీ బయ్యర్లతో మాట్లాడి అన్ని రకాల గ్రేడ్లను కొనుగోలు చేయాలని కోరారు. వేలం నిర్వణాధికారి జి.సునీల్ కుమార్, బోర్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

1048 పొగాకు బేళ్ల కొనుగోలు

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఎస్.ఎస్.కంద్రిక, పెట్లూరూ, వర్ధినేనివారిపాలెం, గ్రామాలకు చెందిన రైతులు 1101 బేళ్ళు వేలానికి తీసుకొని రాగా 1048 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 53 తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 330, కనిష్ట ధర రూ. 205 సరాసరి ధర రూ. 288.05 పలికింది. ఈ వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సులు ప్రారంభం

కనిగిరి రూరల్: కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ కోర్సును శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ కంప్యూటర్ కోర్సును కనిగిరి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం ఉషా పథకం కింద మంజూరైన రూ.5 కోట్లతో నిధులతో కొత్త కోర్సులు, మౌలిక వసతులు, ఆధునిక వసతులు కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 18న నోటిఫికేషన్ రానున్నందున డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని కోరారు.

టంగుటూరులో భారీ వర్షం



టంగుటూరులో వర్షం పడుతున్న దృశ్యం

టంగుటూరు: టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో గ్రామాలల్లో అని రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. స్థానిక బొమ్మల సెంటర్లో వర్షం నీరు పారుతుండటంతో వాహదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాతుల చెంచయ్య వెస్టు కాలనీలో ఇళ్ళలోకి వర్షపు నీరు చేరాయి. పంటలు ఏమీ లేవని వ్యవసాయాధికారులు తెలిపారు, మండలంలో సుమారు 65 మి.మీ వర్షపాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



టంగుటూరులో మాట్లాడుతున్న రాజారావు

టంగుటూరు: జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2024– 25 విద్యా సంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో మిగులుగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ కె. రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ జూన్ 5వ తేదీ నుంచి 15 తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు తప్పని సరిగా ఇంగ్లిషు మీడియం చదివి ఉండాలి. వేటపాలెంలో ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది. పూర్తి వివరాలకు కొండపి నియోజకవర్గం, టంగుటూరు (బాలురు.. ఫోను 9515121249, టంగుటూరు (ఫిషరీస్), (బాలికలు– 9703175895), మార్కాపురం (బాలికలు– 9515411954), యర్రగొండపాలెం నియోజకవర్గం, దరిమడుగు (బాలురు– 7286969849), కనిగిరి (బాలికలు– 9441130614) నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపిక



గుర్రం సుప్రజ



తీకెనం హరిత

సీఎస్‌పురం(పామూరు): జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు(ఎన్ఎంఎంఎస్)కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని 5 పాఠశాలలకు చెందిన ఏడు గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ జె.ప్రసాదరావు తెలిపారు. కేవీ నరసయ్య జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల శీలంవారిపల్లె నుంచి తీకెనం హరిత, గుర్రం సుప్రజ, అంబవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన మకర ధాత్రి, రామగిరి సిద్ధిక్, సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన బండి పుష్ప, చింతపూడి నాగులవరం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన రుషికేతన్‌రెడ్డి, చెన్నపునాయునిపల్లి ఎంపీయూపీ పాఠశాల నుంచి చింతలపూడి వెంకటచరణ్‌తేజ ఎంపికయ్యారు. వీరికి 4 ఏళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల వంతున ఉపకార వేతనం పొందనున్నారు. ఈసందర్భంగా వీరిని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, హెచ్‌యంలు ఖాదరున్నీసాబేగం, చాంద్ బాషా అభినందనలు తెలిపారు.

20 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్న ఐఈఆర్‌టీలు

పామూరు: మండలంలో ఇప్పటి వరకు ప్రత్యేక అవసరాల ఉన్న పిల్లలు 20 మందిని గుర్తించినట్లు ఐఈఆర్‌టీలు ఎస్.ఎస్.సుకవిత, టి.రాజారెడ్డి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. సర్వే తరువాత వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తామన్నారు. మండలలో ఎక్కడైనా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఉంటే భవితభవన్‌లో సంప్రదించాలని కోరారు.